క్లుప్తంగా

పెద్దాపురం పయనమైన భక్తులు

ఏలేశ్వరం: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణానికి చెందిన మహిళా భక్తులు పెద్దాపురం పయనమయ్యారు. పెద్దాపురంలోని మరిడమ్మ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో పారాయణ చేసేందుకు ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు. ఆలయ ప్రాంగణంలో విష్ణు, లలితా సహస్ర పారాయణ, శివ స్రోత్తాలు చేశారు. అనంతరం భక్తిగీతాలు ఆలపించారు. వీహెచ్‌పీ ప్రతినిధులు కటకం కిరిటీ, సీహెచ్ పుల్లయ్య, గట్టెం వెంకటరమణ, సంఘ మహిళా సభ్యులు పాబోలు దేవి, మల్లేశ్వరీ, ఇందిరా, లక్ష్మీకుమారి, రేవతి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

శంఖవరం: నాడు-నేడు పథకంలో చేపట్టిన పనులు వేగంగా పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ తేజ అన్నారు. మండపం జెడ్పీ హైస్కూల్లో జరుగుతున్న గదుల్లో టైల్స్ వేయడం, తాగునీటికి చిన్న వాటర్ ట్యాంకు నిర్మాణం తదితర పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పనులతో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించాలన్నారు. పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. నాణ్యత ప్రమాణాలు పాటించి నిర్మాణాలు చేయాలని, నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

జగ్గంపేట: స్థానిక పోలీసు సర్కిల్ పరిధిలోని కిర్లంపూడి మండలం సోమవరం గ్రామంలో గత నెల 30వ తేదీన చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి రెండు ఉంగరాలు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నామని, మరి కొన్ని వస్తువులు ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నాయని జగ్గంపేట సీఐ సూర్య అప్పారావు తెలిపారు. జగ్గంపేట సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన చోరీ సంఘటన వివరాలు వెల్లడించారు. సోమవారం గ్రామంలో కమిలి చిన్న సుబ్బారావు కుటుంబ సభ్యులు గత నెల 30వ తేదీన ఇంటికి తాళం వేసి బయట నిద్రిస్తుండగా ఇంటిలో చోరీ జరిగిందని తెలిపారు. ఈ సంఘటనలో ఒక నక్లెస్, రెండు మ్యాటీలు, రెండు ఉంగరాలు, 25వేల నగదు చోరీకి గురయ్యాయని తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఎస్సై విద్యాసాగర్ జగ్గంపేట నుంచి విశాఖపట్నం బైకుపై వెళుతున్న పాత నేరస్తుడు గోడే సతీష్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా సోమవరంలో చోరీకి పాల్పడినట్టు ఒప్పుకున్నాడు. ఒక నక్లెస్, రెండు మ్యాటీలను కాతేరుకు చెందిన తన స్నేహితుడు ఒనుము రాంబాబు ద్వారా ముత్తూట్ ఫైనాన్స్‌లో రూ.93 వేలకు తాకెట్టు పెట్టినట్లు తెలిపాడు. మిగిలిన ఉంగరాలను రికవరీ చేశామని ఎస్సై తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. నిందితుడిపై గతంలో 12పోలీసు స్టేషన్లో సమారు 50 వరకూ దొంగతనం కేసులు ఉన్నట్టు తెలిపారు.

ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ వేడుకలు

ఏలేశ్వరం: ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ 72వ ఆవిర్భావ వేడుకలు మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ డిపో సమీపంలోని యూనియన్ కార్యాలయం వద్ద సీనియర్ కామ్రేడ్ ఎస్ఎస్ నారాయణ యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి యూబీఎం కుమార్ మాట్లాడుతూ 1952లో ఇదే రోజున యూనియన్ ఆవిర్భావించిందని, అప్పటి నుంచి అనేక పోరాటాలు చేస్తూ కార్మికులకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామన్నారు. యాజమాన్యం కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో బి.నానిబాబు, గ్యారేజీ చలం, ప్రసాద్, నల్లయ్య, ఎన్‌వీ రావు, కార్మికులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

తుని రూరల్: ఉజ్వలమైన భవిష్యత్ ఉన్న యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మమత ఆసుపత్రి వైద్యుడు సయ్యద్ నూషాద్ అన్నారు. మంగళవారం వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ, జన విజ్ఞాన వేదిక, డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్, మాదకద్రవ్యాలు, ఇతర మత్తు పదార్థాలు వాడడంతో యువత బంగారు భవిత కోల్పోతారన్నారు. దేశ సంపద యువతే అన్నారు. ఈ సందర్భంగా వ్యాచరచన పోటీలు నిర్వహించి విజేతలైన వి.చందు, యు.శృతి సరోజ, జి.నవీన్, జి.జాన్, జి.భరత్, జి.మణిసాయిలకు బహుమతులను అందజేశారు. డాక్టర్ ఎన్.సూర్య నారాయణ, ప్రిన్సిపాల్ సీహెచ్ లలిత, మమత ఆసుపత్రి మేనేజరు డి.జగపతి రాజు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కె.సింహాచలం పాల్గొన్నారు.

అభివృద్ధి మరింత జరగాలంటే జగనే రావాలి

జగ్గంపేట: రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి మరో సారి అధికారంలోకి రావాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత తోట నరసింహం అన్నారు. మన్యవారిపాలెం గ్రామంలో గాది కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అమలవుతున్నాయన్నారు. ఈ అభివృద్ధి కొనసాగాలంటే ప్రజలు సీఎం జగన్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావాలన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు అత్తులూరి సాయిబాబు, తులా రాము, కరుటూరి శ్రీనివాస్, ఎస్‌ఏ గఫూర్, జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, గోకవరం మండలాల నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్ సమాచారం ఇవ్వడంతో..



నేను టైలరింగ్ వృత్తిలో ఉన్నారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన వైఎస్సార్ చేదోడుకు నన్ను ఎంపిక చేశారు. ఈ పథకాన్ని ప్రవేశపెట్టన వెంటనే వలంటీర్ మా ఇంటికి వచ్చి సమాచారం ఇచ్చారు. దానికి కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు సమకూర్చాడు. నా పనికి ఆటంకం లేకుండా ప్రభుత్వ పథకం అందుకున్నాను. వలంటీర్ లేకపోతే కార్యాలయాల చుట్టూ తిరిగి సమమం వృథా చేసుకొని నా ఆదాయాన్ని కోల్పోయే వాడిని.

– కోరాద రాజు, టైలర్, ఏలేశ్వరం

కార్యాలయాల చుట్టూ తిరగకుండా..



వలంటీర్ల వ్యవస్థ ఎంతో ఉపయోగకరంగా ఉంది. దీని వల్ల పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు కార్యాలయాల చుట్టూ తిరిగే పని తప్పింది. గతంలో ఏ పథకాలు వచ్చిన తెలిసేది కాదు. ఇప్పుడు ప్రభుత్వం ఏ పని చేసినా, ఏ పథకం ప్రవేశపెట్టినా వలంటీర్లు వచ్చి చెబుతున్నారు. నాకు ప్రతి నెలా ఒకటో తేదీ తెలవారు జామునే పింఛను అందుతోంది. వలంటీర్ వ్యవస్థ పెట్టిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– కటకం కిరిటీ, సిటిజన్ ఏలేశ్వరం

వలంటీర్ సేవలు ఉపయోగకరం



ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ వలంటీర్ల పనితీరు చాలా బాగుంది. పింఛను తెల్లవారుజామునే ఇంటి వద్దకు వచ్చి ఇస్తున్నారు. అంతేకాకుండా ఎవరికీ ఏ అవసరం ఉన్నా తెలుసుకుని సాయం అందిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయ పనులు, ఇతర సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్నారు. అర్హత ఉంటే వెంటనే అప్లై చేస్తున్నారు. వారిని సంక్షేమ పథకాలు అందేలా చేస్తున్నారు. వలంటీరు సేవలు చాలా ఉపయోగంగా ఉన్నాయి.

– తొంటా వీరమ్మ, ఎస్.పైడిపాల, రౌతులపూడి మండలం

ఆర్థిక ఇబ్బంది తప్పింది



మా వలంటీరు సుర్ల శ్రీనివాసు ప్రభుత్వ పథకాలు ఏవి వచ్చినా వెంటనే వచ్చి చెబుతాడు. గతంలో ఇలా చెప్పే వారు లేక ఎన్నో పథకాలు కోల్పోయాం. అంతేకాకుండా ప్రతి పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ఎక్కడో ఉన్న కార్యాలయాలకు చార్జీలు కట్టుకునే వెళ్లే వాళ్లం. దీంతో ఆర్థికంగా ఇబ్బంది పడేవాళ్లం. ఇప్పుడు ఆ పని వలంటీర్లే చేస్తున్నారు. దీంతో మా పని చేసే వారు లేరు అనే బాధను మార్చిపోయి ఆనందంగా ఉంటున్నాం.

– సుర్ల లింగయ్య, టీజే నగరం, కోటనందూరు

సేవలందించి.. మన్ననలు పొంది..

పల్లెల్లోనే ప్రజలకు ప్రభుత్వ సేవలందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ప్రవేశపెట్టింది. వీటి ద్వార సంక్షేమ పథకాలు ప్రజల ముంగిటకు చేరుతున్నాయి. ప్రభుత్వం ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీరును నియమించింది. వారు ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా నిలిచారు. పథకాలపై ఎప్పటికప్పుడు లబ్ధిదారులను చైతన్య పరుస్తున్నారు. ప్రభుత్వం చేస్తున్న ప్రతి పనిని ప్రజల వద్దకు చేర్చుతూ మన్ననలు పొందుతున్నారు. వారు అందిస్తున్న సేవలకు ప్రశంసలు అందుకుంటున్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో వారు అందించిన సేవలు విలువ కట్టలేమని పలువురు లబ్ధిదారులు చెబుతున్నారు. వలంటీర్ సేవలపై పలువురి అభిప్రాయాలు వారి మాటల్లోనే..

ఇంటి వద్దకే పింఛను



వలంటీర్లు ఇంటి వద్దకే పింఛను తెచ్చి ఇస్తున్నారు. ఒకటోతారీఖు రాగానే పింఛను సొమ్ము అందుతోంది. గతంలో పింఛన్ కోసం రోజుల తరబడి క్యూలో వేచి ఉండేదాన్ని. వలంటీర్ల వ్యవస్థ నాలాంటి వృద్ధులకు వరమని చెప్పవచ్చు. ఇది ఎంతో మందికి మేలు చేస్తోంది.

– బొగ్గు కాంతం, వృద్ధురాలు, ఏలేశ్వరం

ఇంటి మనిషిలా..



ప్రతి నెలా ఒకటో తారీఖున మా వలంటీర్ నందిక భవాని వచ్చి పింఛనుతోపాటు ఇంటిలో మనిషిలా నా ఇబ్బందులను అడిగి తెలుసుకునేది. ఏదైనా ఇబ్బంది ఉంటే వెంటనే సాయం చేసేది. వలంటీర్ వల్లే నాకు ఇంటి స్థలం, ఇల్లు కూడా మంజూరైంది. దరఖాస్తులకు సంబంధించి అన్ని విషయాలు చెబుతుంది. వలంటీర్ వ్యవస్థతో పేదలకు ఎంతో మేలు జరిగింది. వాళ్లపై ఆరోపణలు చేయడం వమంచి కాదు.

-పారేపల్లి తులసి, కోటనందూరు

తిప్పలు తప్పాయి



ప్రభుత్వం నెల నెలా ఇచ్చే పింఛన్ ఇంటికొచ్చి వలంటీర్ ఇస్తున్నాడు. గత ప్రభుత్వంలో పింఛను కోసం పంచాయతీ ఆఫీసుకు వెళ్లి గంటల కొద్ది వేచి ఉండేవాళ్లం. అధికారులు వచ్చి రేపు మాపు అంటు తిప్పేవారు. రోజుల తరబడి తిరిగేవాళ్లం. ఇప్పుడు సీఎం జగన్ ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలన్నీ అందుతున్నాయి. దీనివల్ల ఎన్నో తిప్పలు తప్పాయి.

– మఠం తాతబ్బాయి, జి.కొత్తపల్లి, శంఖవరం మండలం

కరోనా సమయంలో సేవలు



కరోనా సమయంలో నా కొడుకు వ్యాధి బారిన పడ్డాడు. ఎవరూ మమ్మల్ని ముట్టేవారుకాదు. సాయం కూడా అందించలేదు. మంచినీళ్ల లేక తీవ్ర ఇబ్బంది పడ్డాం. ఆ సమయంలో వలంటీర్‌కు ఫోన్ చేస్తే వచ్చారు. బయట కుళాయిల వద్ద బిందెలతో నీళ్ల పట్టి ఇచ్చారు. బొప్పాయి ముక్కలు, నిమ్మకాయలను కూడా ఇచ్చారు. ఆ రోజు వాళ్ల చేసిన సాయం ఎన్నటికి మర్చిపోలేను. వలంటీర్ల సేవలకు ఏమిచ్చి రుణం తీర్చుకోగలం కృతజ్ఞతలు చెప్పడం తప్ప.

– సీంద్రపు లక్ష్మి, దుర్గమ్మ వీధి, ప్రత్తిపాడు

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై వలంటీర్ల ఆగ్రహం



కొంతంగి సచివాలయంలో నిరసన తెలియజేస్తున్న వలంటీర్లు



గోకవరంలో నిరసన తెలుపుతున్న వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు

రౌతులపూడి: జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఏలూరు సభలో గ్రామ వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం వలంటీర్లు మండల వ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్లకార్డులతో సచివాలయాల వద్ద ఆందోళన చేపట్టి, పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. గుమ్మరేగుల సెంటర్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద గ్రామ వలంటీర్లు చేపట్టిన నిరసనకు సర్పంచ్ రాపర్తి రామకృష్ణ మద్దతిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవనీతికి పాల్పడకుండా కేవలం ఐదు వేల రూపాయల జీతం తీసుకుంటూ ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లపై పవన్‌కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. వెంటనే వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

శంఖవరంలో నిరసన

శంఖవరం: జనసేన అధినేత పవన్ కల్యాణ్ వెంటనే క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. మండలంలోని శంఖవరం, కొంతంగి, కత్తిపూడి, జి.కొత్తపల్లి గ్రామాల వలంటీర్లు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ ఏ అధికారంతో వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేశారో పవన్‌కల్యాణ్ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆధారాలు లేకుండా నోటికొచ్చినట్టు మాట్లాడడం పవన్ కల్యాణ్ చేతకాని తనానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో దిష్టి బొమ్మ దహనం చేశారు.

పవన్ వ్యాఖ్యలు సరికాదు

గోకవరం: నిస్వార్థంగా ప్రజలకు సేవ అందిస్తున్న వలంటీర్లపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు సరికాదని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. వలంటీర్లపై పవన్ వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం గోకవరంలోని నాలుగు సచివాలయాల పరిధిలోని వలంటీర్లు స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో పవన్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. నాయకులు మాట్లాడుతూ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్న వలంటీర్ వ్యవస్థలో ఏమీ ఆశించకుండా కేవలం రూ.5 వేలు తీసుకుంటూ ప్రజాసేవ చేస్తుంటే వారిపై పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు సరికాదన్నారు. మహిళల గురించి మాట్లాడే నైతిక హుక్కు ఆయనకు లేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని, మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా దిశ చట్టం తీసుకువచ్చారన్నారు. వలంటీర్లలో సైతం అధిక సంఖ్యలో మహిళలే ఉన్నారన్నారు. తక్షణమే పవన్ వారికి క్షమాపణలు చెప్పాలన్నారు. పలువురు మహిళా వలంటీర్లు మాట్లాడుతూ తమపై అసంబద్ధత వ్యాఖ్యలు చేసిన వపన్‌కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, వలంటీర్లు పాల్గొన్నారు.

రేపు ఎంపీపీ ఎన్నిక

తొండంగి: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తొండంగి ఎంపీపీ ఎన్నిక ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీఓ పసపులేటి సతీష్ మంగళవారం తెలిపారు. ఇటీవల ఎంపీపీ అంగుళూరి అరుణ్‌కుమార్ అనారోగ్య కారణంగా మరణించిన నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఈ మేరకు ఈ నెల 9వ తేదీన అందరి ఎంపీటీసీలకు నోటీసులిచ్చామన్నారు. రిజర్వేషన్ ప్రకారం ప్రస్తుతం ఉన్న ఎంపీటీసీలు నూతన ఎంపీపీను ఎన్నుకుంటారని, గురువారం 11 గంటలకు ఎన్నిక జరుగుతుందన్నారు.

మేజర్ డ్రైన్ పూడిక తీత పనులు

ప్రత్తిపాడు: స్థానిక మసీదు సెంటర్ నుంచి జాతీయ రహదారి వరకూ కిలో మీటరుకు పైగా ఉండే మేజర్ డ్రైన్‌లో పూడికతీత పనులు మంగళవారం ప్రారంభించారు. ఎన్నో ఏళ్లగా ఉన్న ఈ సమస్య ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ చొరవతో తీరింది. ఎమ్మెల్యే సొంత నిధులతో జేసీబీతో పాటు సామగ్రి అందించి మేజర్ డ్రైన్ బాగుజేసేందుకు శ్రీకారం చుట్టారు. డ్రైన్ పూడితతీత పనులను స్థానిక సర్పంచ్ గుడాల విజయలక్ష్మి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం, ఆయా వార్డు సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు రక్ష

ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



ఉప్పలపాడులో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



ఏలేశ్వరంలో లబ్ధిదారుడికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న కమిషనర్ కొండలరావు

గండేపల్లి: జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు రక్షణ అని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పేర్కొన్నారు. ఉప్పలపాడులో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్టు చెప్పారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, ఏఎంసీ చైర్మన్ జనపరెడ్డి బాబు, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు ఒబిణ్ని వీరబాబు, సచివాలయాల మండల కన్వీనర్ తాళ్లూరి మదు, గ్రామ సర్పంచ్ అడబాల ఆంజనేయులు, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, సొసైటీ అధ్యక్షుడు అడబాల రాజు, సుబ్బయమ్మపేట సర్పంచ్ బొబ్బర శివ, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గోకవరం: మండలంలోని కొత్తపల్లి-1, కొత్తపల్లి-2 సచివాలయాల పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పాల్గొని మాట్లాడారు. అనంతరం కొత్తపల్లి-1 సచివాలయ పరిధిలో 1032, కొత్తపల్లి-2 సచివాలయ పరిధిలో 1360 సర్టిఫికెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగ్గంపేట: మల్లిసాల గ్రామంలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పాల్గొని మాట్లాడారు. పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు పూర్తిస్థాయిలో పథకాలు అందుతున్నాయని మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ మసిరపు బుజ్జి అన్నారు. పట్టణంలో మంగళవారం కమిషనర్ కొండలరావు అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వైస్‌చైర్‌పర్సన్ బుజ్జి చేతుల మీదుగా లబ్ధిదారులకు పలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ కె.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణఅధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: అర్హులందరికీ మేలు చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ కేఎస్వీ మాధవరావు తెలిపారు. మంగళవారం కిర్లంపూడిలోని సచివాలయం-3 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి లబ్ధిదారులకు ధ్రువ ప్రతాలు అందజేశారు. వైస్‌ఎంపీపీ బొడ్డేటి గణపతి, ఎంపీటీసీ కాళ్ళ దొంగబాబు, ఈఓపీఆర్డీ రామిశెట్టి వీర్రాజు, నాయకులు పాల్గొన్నారు.

తుని రూరల్: ఎస్.అన్నవరం-4 (జగన్నాథగిరి) సచివాలయంలో వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జి సకురు నాగేంద్ర నెహ్రూ పాల్గొని లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

అన్నవరం: స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఎస్.కుమార్ రాజా అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.సుబ్రహ్మణ్యం పాల్గొని లబ్ధిదారులకు 294 సర్టిఫికెట్లు అందజేశారు. శంఖవరం వైస్ ఎంపీపీ ధారా వేంకట రమణ, గ్రామ ఉపసర్పంచ్ బొబ్బిలి వేంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: లంపకలోవ గ్రామ సచివాలయం వద్ద మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ 80 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

కోటనందూరు: స్థానిక సచివాలయం-1 వద్ద సర్పంచ్ గర్సింగు శివలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ లగుడు శ్రీనివాసు లబ్ధిదారులకు ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

రౌతులపూడి: ఎన్.ఎన్.పట్నంలో ఎంపీడీఓ ఎం.గోవిండ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ పాల్గొని మాట్లాడారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- జగపతినగరంలో గడపగడపకూ మన ప్రభుత్వం



జగపతినగరంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

కిర్లంపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మంగళవారం జగపతినరగం సచివాలయం-2లో ఎమ్మెల్యే చంటిబాబు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా ? లేదా ? అని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకోని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, నాడు-నేడు వంటి పథకాలు ద్వారా విద్యా వ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, వైఎస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, దోమాల గంగాధర్, పెంటకోట నాగబాబు, చదలవాడ బాబీ, పెనగంటి రాజేష్, బొజ్జపు శ్రీను, దాడి చినగోవిందు, యల్లపు లోవ సంఘన వెంకటేశ్వరావు, మద్దాల రాంబాబు, అధికారులు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఆర్బీకే సిబ్బందికి శిక్షణ

ప్రత్తిపాడు: రైతాంగానికి సూక్ష్మ నీటి సాగు పథకంపై అవగాహన కల్పించాలని కాకినాడ జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి (డీఎంఐఓ) జీవీవీ ప్రసాదరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని ఆర్బీకే సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. జగ్గంపేట ఇన్‌చార్జి ఏడీఏ యింటి వీర గంగాధర్‌తో పాటు రైతు భరోసా కేంద్రాల వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలు పాల్గొన్నారు.

సుందరమ్మ సత్రం భూముల పరిశీలన

గోకవరం: రంపయర్రంపాలెం గ్రామంలో సుందరమ్మ సత్రం భూముల్లో గత 58 సంవత్సరాలుగా జరిగిన అవినీతిపై హైకోర్టు విశ్రాంత న్యాయ మూర్తితో విచారణ నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. గ్రామంలోని సత్రం భూములను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ గత 58ఏళ్లుగా భూకబ్జాదారులు, దేవదాయశాఖ అధికారులు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడ్డారన్నారు. 90 ఎకరాల భూమిలో ఐదెకరాల్లో ఉన్న తుప్పలు, డొంకలు ఫొటోలు తీసి మొత్తం భూములు ఇదే విధంగా ఉన్నాయని ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు పంపేవారన్నారు. రైతు కూలీ సంఘం పోరాట ఫలితంగా 67 ఎకరాల భూములకు కౌలు వేలం నిర్వహించారని, దీని ఫలితంగా ప్రభుత్వానికి రూ.16 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. దీని ప్రకారం చూస్తే గడచిన ఇన్నేళ్లలో ఎంత ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారో తెలుస్తుందన్నారు. కొందరు భూకబ్జాదారులు ఈ భూముల్లో టేకుచెట్లు, మామిడి, జీడిమామిడి చెట్లు నరికి తరలించుకుపోయారన్నారు. ఇప్పటికైనా అధికారులు పందించి మిగిలిన 15 ఎకరాలకు కూడా వేలం నిర్వహించాలన్నారు. సంఘం సభ్యులు ముసలయ్య, కడితి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మరిన్ని వైద్య సేవలు

గండేపల్లి: చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చిన రోగులకు మరింత వైద్యసేవలు అందించాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ చలగళ్ల దొరబాబు (పద్మనాభుడు) తెలియజేశారు. మండల కేంద్రమైన గండేపల్లిలో ప్రభుత్వ ఆస్పత్రిని మంగళవారం ఆయన పరిశీలించి వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సంక్షిప్తంగా..

రేపు రాజమహేంద్రవరంలో అవగాహన సదస్సు

తుని/జగ్గంపేట: ఆర్టీసీకి చెందిన ఖాళీ స్థలాలు లీజుకు ఇచ్చేందుకు జారీ చేసిన టెండర్ నోటిఫికేషన్‌కు సంబంధించి గురువారం రాజమహేంద్రవరం రీజనల్ కార్యాలయంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశామని తుని డిపో మేనేజరు కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. కాకినాడ జిల్లా పరిధిలోని తుని, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, సామర్లకోట, జగ్గంపేటలలోని ఖాళీ స్థలాలు 15 ఏళ్లకు లీజుకు ఇవ్వడానికి టెండర్లు పిలిచారు. ఆసక్తి ఉన్న వ్యక్తులు ఈ నెల 20 లోగా టెండర్లు దాఖలు చేసుకోవాలని కోరారు.

అరబిందో ఫార్మా కంపెనీ క్యాంపస్ డ్రైవ్

తుని రూరల్: వి.కొత్తూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అరబిందో ఫార్మా కంపెనీ ప్రతినిధులు క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. బీఎస్సీ, ఎంఎస్సీకి చెందిన 120 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరిలో 40 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ సీహెచ్ లలిత తెలిపారు.

ఐటీఐ ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

తుని: ప్రభుత్వ ఐటీఐలో రెండో విడత అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు పాయకరావుపేట ఐటీఐలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

కొండ చిలువ హతం

శంఖవరం: కత్తిపూడి కొండవారిపేటలోకి వచ్చిన సుమారు 5 అడుగుల కొండచిలువను స్థానికులు మంగళవారం హతమార్చారు. భయాందోళనకు గురైన స్థానికులు ఊపిరి పీల్చుకునర్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

గండేపల్లి: గ్రామాల వారీగా సర్వే నిర్వహించి ఉపాధి జాబ్ కార్డు ఇచ్చి పనులు కల్పించాలని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి సిబ్బందికి సూచించారు. కె.నాయకంపల్లిలో మలిరెడ్డి గంగాభవాని పొలంలో కొబ్బరి మొక్కల పంటను ఆమె పరిశీలించి, రైతుకు తగు సూచనలు ఇచ్చారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ఆర్ గంగాభవాని, ఈసీ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

కిర్లంపూడి: స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయం పరిసరాలలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.28,300 స్వాధీనం చేసుకున్నట్టు జగ్గంపేట సీఐ సూర్య అప్పారావు తెలిపారు.

కుటుంబ నియంత్రణ పాటించాలి

గోకవరం: జనాభా పెరుగుదల నియంత్రణకు ప్రజలు విధిగా కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలని గోకవరం అభివృద్ధి కమిటీ సభ్యులు కర్రి సూరారెడ్డి, పి.సత్యానందం అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఆస్పత్రి ప్రధాన వైద్యురాలు వనజాకుమారి మాట్లాడుతూ ప్రస్తుతం దేశ జనాభా 142 కోట్లు దాటిందని, ప్రజలంతా కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలన్నారు. ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీను, హెచ్‌వీ శైలజ పాల్గొన్నారు.